

## మాసానిగూడలో వనమహోత్సవం

**మొక్కలు నాటి నీరు పోసిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య**

చేవెళ్ల రూరల్, జూలై 12 : శంకర్‌పల్లి మండల పరిధిలోని మాసానిగూడ గ్రామంలో శుక్రవారం మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని, నాటిన ప్రతి మొక్కనూ సంరంక్షించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకయ్య, ఎంపీవో, మాజీ ప్రజా ప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల ఊరేగింపు



పూజల్లో పాల్గొన్న రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే యాదయ్య



అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తున్న మహిళలు

చేవెళ్లటౌన్, జూలై 12: చేవెళ్ల మండల కేంద్రంలోని చంద్రారెడ్డి నగర్ కాలనీలోని పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు శుక్రవారం అమ్మవారికి బోనాల ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యకమానికి తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి భీమ్ భారత్, డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకట్ స్వామి, సినీ నటుడు బిత్తిరి సత్తి పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు భీమయ్య, శ్రీనివాస్, ప్రభాకర్, శైలజ ఆగిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు రాములు, వసంతం, నాయకులు నారాయణ, కుమార్ పాల్గొన్నారు.

# పారిశుధ్య వ్యవస్థను మెరుగుపరచాలి

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

షాద్‌నగర్, జూలై12: మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయాలని, కార్మికుల సేవలను మరింత విస్తరింపచేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితో పాటు ఆయన పాల్గొని మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్యంపై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని కాలనీల్లో చెత్త సేకరణ చేపట్టాలన్నారు. వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్. నటరాజన్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**మొక్కలను నాటిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ**

వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణకు అన్ని వర్గాల ప్రజలు మొక్కలను నాటాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్. నటరాజన్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్లు, విద్యార్థులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

**పరిసరాల శుభ్రతతో వ్యాధులను అరికట్టొచ్చు**

ఆమనగల్లు : పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని మున్సిపల్ కమిషనర్ వసంత పేర్కొన్నారు. ఆమనగల్లు పురపాలక సంఘంలో డైరెక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, కలెక్టర్ ఆదేశానుసారం ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అన్ని వార్డుల్లో బ్లీచింగ్ పౌడర్‌తో సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మణ్, విజయ్‌కృష్ణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**దోమల నివారణకు ప్రత్యేక చర్యలు**

చేవెళ్ల రూరల్ : దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకొని డెంగీ వ్యాధిని నివారిద్దామని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి వార్డుల్లో శుభ్రత, పరిశుభ్రత కార్యక్రమం చేపట్టి డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వాటి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.



ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు సూచనలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ వసంత



శంకర్‌పల్లి మున్సిపాలిటీలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్



## మేడిగడ్డ తండావాసికి డాక్టరేట్

ఆమనగల్లు, జూలై 12: మండల పరిధిలోని మేడిగడ్డ తండాకు చెందిన ఎన్. రమేశ్‌నాయక్ ఉస్మానియా యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ నుంచి డాక్టరేట్ పట్టా పొందటం జరిగింది. ప్రొఫెసర్ చెన్నప్ప మార్గదర్శకంలో పాలసీ హోల్డర్స్ సాటిస్‌ఫ్యాక్షన్ టువార్డ్స్ సర్వీసెస్ ఆఫర్ బై లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఏ స్టడీ విత్ రెఫరెన్స్ టు హైదరాబాద్ డిస్ట్రిక్ట్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఓయూ నుండి డాక్టరేట్ పట్టా పొందినట్లు రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా రమేశ్ నాయక్ మాట్లాడుతూ డాక్టరేట్ పట్టా రావడానికి సహకరించిన తల్లిదండ్రులు, ప్రొఫెసర్లకు ధన్యవాదాలు తెలిపారు.

## నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ.. పోలీసుల దాడి

బండ్లగూడ, జూలై 12: నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు శుక్రవారం ఓ గోదాంపై దాడిచేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బుద్వేల్ గ్రీన్ సిటీలో ఓ వ్యక్తి నకిలీ పేస్ట్‌ను తయారు చేస్తున్నాడని ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం వచ్చింది. పోలీసులు ఆ కేంద్రంపై దాడి చేసి 15 లక్షల విలువజేసే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు దర్యాప్తులో ఉన్నదని పోలీసులు తెలిపారు.



తుర్కయాంజల్: ఉపాధ్యాయులను సన్మానించిన లయన్స్ క్లబ్ సభ్యులు



మంచాలలో సన్మానించిన ఉపాధ్యాయులతో విద్యార్థులు, సహోపాధ్యాయులు



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్

# ఉపాధ్యాయులకు ఘన సన్మానం

తుర్కయాంజాల్, జూలై 12 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడ ఎన్ఎస్ఆర్ నగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో విధులను నిర్వర్తించి ఇటీవలే బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు సుందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రవణ్‌కుమార్‌లను శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ రాగన్నగూడ సభ్యులు సన్మానించారు. అదే విధంగా బదిలీపై పాఠశాల వచ్చిన ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, ఉపాధ్యాయులు కృష్ణలను సన్మానించారు. లయన్స్ క్లబ్ 320సీ జోనల్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ రాగన్నగూడ అధ్యక్షుడు భీంరెడ్డి ఉన్నారు.

మంచాల, జూలై 12: బదిలీలపై వెళ్తున్న ఉపాధ్యాయులు జగన్, పి.జయమ్మ, ఆర్ రాజమల్లయ్య, ఎన్ కేశవరావు, పీ రాఘవేందర్‌లను శుక్రవారం మంచాల జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డితో పాటు విద్యార్థులు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సహకార సంఘం చైర్మన్ పుల్లారెడ్డి, ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు శేఖర్, పంచాయతీ మాజీ కోఆప్షన్ సభ్యుడు బాల్‌రాజ్, పాఠశాల చైర్మన్ స్వరూపతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

**వెల్జాల్ గ్రామంలో**

కడ్తాల్ (తలకొండపల్లి) : మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో నలుగురు ఉపాధ్యాయులు బదిలీపై ఇతర మండలాలకు వెళ్లారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు శ్రీనివాస్‌యాదవ్ పాల్గొని మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులకు జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తి, నాయకులు విజయ్‌కుమార్, శ్రీరామ్, వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు లీల, నస్రీన్, పరమేశ్, సుజాత, విజయ, గీతాంజలి, విద్యార్థులు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానించిన గ్రామస్తులు

**ఇబ్రహీంపట్నంరూరల్ :** మండలంలోని పలు ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన 40మంది ఉపాధ్యాయులను శుక్రవారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు పరమేశ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడు గోవవర్ధన్‌యాదవ్, పంచాయతీరాజ్ ఏఈ ఇంద్రసేనారెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు మహేందర్‌రెడ్డి, రాజు, శ్రీణివాస్, వేణుగోపాల్‌రెడ్డి, జమీర్ తదితరులున్నారు.

**చేవెళ్ల రూరల్ :** శంకర్‌పల్లి మండల పరిధి ఎల్వర్తి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 8 సంవత్సరాలుగా సేవలందించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు అన్నపూర్ణ, పద్మజ, సరితలను గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సత్యానారాయణ, ప్రధానోపాధ్యాయురాలు సాహితీ, ఉపాధ్యాయురాలు పద్మ, విద్యార్థులు ఉన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గోవర్ధన్‌యాదవ్, పరమేశ్ తదితరులు..

## అంగన్‌వాడీ సిబ్బందికి బోధనపై అవగాహన

ఆమనగల్లు, జూలై 12 : ఐసీడీఎస్ ఆమనగల్లు ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాల అంగన్‌వాడీ టీచర్లకు శుక్రవారం ఆమనగల్లు ఐసీడీఎస్ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య-సంరక్షణ అనే అంశంపై శిక్షణ ఇవ్వడం జరిగిందని ఐసీడీఎస్ సీడీపీవో రోజా తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లను ఆరు గ్రూపులుగా చేసి ప్రతి గ్రూపునకు మూడు రోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రానికి పిల్లలకు ఎలాంటి కృత్యాలు నేర్పాలి, బోధన ఎలా జరపాలి వీటితో పాటు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఐసీడీఎస్ డిపార్ట్‌మెంట్ నుంచి వచ్చిన ప్రియదర్శిని అనే పుస్తకం అందజేయడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ పార్వతి, సూపర్‌వైజర్లు శబరి, సరళ, కవిత, మమత, బాలమణి, పద్మ, అంగన్వాడీ టీచర్లు ఉన్నారు.



ప్రియదర్శిని పుస్తకంతో సీడీపీవో రోజా, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు



వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

## ఆలయంలో వేలం పాట

కడ్తాల్, జూలై 12: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ తల్లి ఆలయ ఆవరణలో శుక్రవారం బహిరంగ వేలం పాటను నిర్వహించారు. జిల్లా దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త శిరోలీపంతూనాయక్, ఆలయ ఈవో స్నేహలత ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో కొబ్బరికాయల విక్రయం, వాహనాలకు నిర్వహించే పూజ రసీదు రుసుము వసూలు చేసుకొనుటకు వేలం పాట నిర్వహించారు. కొబ్బరికాయల విక్రయానికి మైసిగండి గ్రామానికి చెందిన రమావత్ అమ్మనాయక్ రూ.39,12,000లకు దక్కించుకున్నాడు. వాహనాల పూజ రసీదు రుసుములు వసూలు చేసుకోవడానికి నిర్వహించిన వేలంలో ఇదే గ్రామానికి చెందిన కేతావత్ శివరాం రూ.13,11,000 లక్షలకు వేలంను చేజిక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు భాస్కర్‌నాయక్, ఆలయ అర్చక సిబ్బంది యాదగిరి, బోడియనాయక్, కృష్ణ, చంద్రయ్య, రాములు, దేవేందర్, రమాదేవి, శ్రీనివాసులు, పరంసింగ్‌నాయక్, సుమన్‌నాయక్ పాల్గొన్నారు.

**తలకొండపల్లిలో తైబజారు..**

కడ్తాల్ (తలకొండపల్లి) : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి శ్రీకాంత్ అధ్యక్షతన తైబజారు వేలం పాటను నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన ఈ వేలం పాటలో అశ్వ యాదయ్య రూ.1,84,000 లక్షలకు తైబజారును దక్కించుకున్నాడు. అనంతరం యాదయ్యకు పంచాయతీ అధికారులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, మాజీ సర్పంచ్ జ్యోతయ్య, మాజీ ఎంపీటీసీ హేమరాజు, మాజీ ఉప సర్పంచ్ అనిల్, నాయకులు యాదగిరి, పాండు, మధు, ఆజీమ్, రవీందర్, మహేశ్, ప్రసాద్, గణేశ్ పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యను పరిష్కరించాలి

కడ్తాల్, జూలై 12: మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ఎంఈవో సర్దార్‌నాయక్, మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు నాలుగు నెలలుగా గౌరవ వేతనం, బిల్లులు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆమనగల్లు, కడ్తాల్ మండలాల అధ్యక్షులు సత్యమ్మ, లక్ష్మమ్మ, సభ్యులు యాదమ్మ, భాగ్యమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనే లక్ష్యం



శ్మశాన వాటికలో స్నానపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కౌన్సిలర్ సునీల్

తుర్కయాంజాల్, జూలై 12: వార్డు పరిధిలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తుర్కయాంజాల్ మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్ సునీల్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ 18వ వార్డులోని శ్మశాన వాటికలో రూ.20 లక్షలతో స్నానపు గదుల నిర్మాణానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో విచారణ గురువు తాతిరెడ్డి జయరాజు, సహ గురువు ఆరోగ్య స్వామి, చర్చి కమిటీ సభ్యులు ఆరోగ్యం, మరియరాజు, మార్తయ్య, రాజు, వినయ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బడంగ్‌పేట, జూలై12: తుక్కుగూడ మున్సిపాలిటీలో సీజనల్ వ్యాధులపై మున్సిపల్ చైర్మన్ కాటేకర మధుమోహన్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. వ్యాధులపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని వ్యాధులకు బస్తీ దవాఖానలో చికిత్స చేయడం జరుగుతుందన్నారు. డెంగీ వంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. తెలంగాణ డయాగ్నస్టిక్‌లో అన్ని రకాల పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. రెండు నుంచి పదిహేను సంవత్సరాల పిల్లలకు మెదడు వాపు వ్యాధి వస్తుందన్నారు. పిల్లలకు తప్పని సరిగా టీకా వేయించాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చైర్మన్, కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకట్రామ్, మెనేజర్ పర్వతాలు, మల్లేశ్, జంగయ్య, వైద్యులు పాల్గొన్నారు.



బోల్తా పడిన కాటన్ దిమ్మెల డీసీఎం



భారీగా నిలిచిపోయిన వాహనాలు

## కొత్తూరులో ఘోర రోడ్డు ప్రమాదం

**ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు**

కొత్తూరు, జూలై 12: కొత్తూరు వై జంక్షన్ వద్ద శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. కొత్తూరు పోలీసుల వివరాల ప్రకారం. ..స్క్రాప్ డీసీఎం కొత్తూరు టౌన్ నుంచి, వై జంక్షన్ వద్ద హైవేపై యూటర్న్ అవుతుంది. అదే సమయంలో కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు పైపుల లారీ కంటైనర్ ను డ్రైవర్ ప్రహల్లాద అతివేగంగా నడుపుకుంటూ వచ్చి కుడివైపు టర్న్ చేస్తూ స్క్రాప్ డీసీఎంను ఢీ కొట్టుకుంటూ హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు వెళుతున్న కాటన్ దిమ్మెల లారీని కూడా ఢీకొట్టాడు. లారీ ఎడమవైపు పల్టీ కొట్టింది. అదే వైపు నుంచి స్కూటీ నడుపుకుంటూ వెళ్తున్న పెంజర్ల గ్రామానికి చెందిన కందివనం అంజయ్య పై పడింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. స్కూటీ వెనుక ఉన్న దినేష్‌కు గాయాలు అయ్యాయి. అలాగే కంటైనర్ డ్రైవర్ ప్రహల్లాద కూడా గాయపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తూరు సీఐ నరసింహారావు తెలిపారు.

**భారీగా ట్రాఫిక్ జామ్..**

మూడు వాహనాలు ఢీకొన్న ఘటలో నేషనల్ హైవే 44పై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్లే వాహనాల రద్దీ ఏర్పడింది. శంషాబద్ నుంచి కొత్తూరు రావడానికి సుమారు 3 గంటల సమయం తీసుకుంది.

**చేవెళ్లలో చికిత్స పొందుతూ బాలుడు మృతి**

చేవెళ్ల రూరల్ : రోడ్డు ప్రమాదంలో బాలుడు గాయపడి దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని దామరగిద్ద గ్రామానికి చెందిన చాకలి వీరయ్య(42)తన కుమారుడు చాకలి రాజేశ్(16) గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన తన స్నేహితులు వినయ్, అభిషేక్‌తో కలిసి ద్విచక్రవాహనంపై దామరగిద్ద నుంచి చేవెళ్ల వెళ్తున్నారని తెలిపారు. మార్గం మధ్యలో చేవెళ్ల మోడల్ కాలనీ సమీపంలో ప్రధాన రహదారిపై వినయ్ నడుపుతున్న ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడగా వినయ్, అభిషేక్‌కు స్వల్ప గాయాలు కాగా, రాజేశ్ తలకు బలమైన గాయం కావడంతో నగరంలోని ఉస్మానియాకు తరలించారు. చికిత్స పొందుతూ రాజేశ్ శుక్రవారం మృతి చెందాడని తెలిపారు. తండ్రి వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ప్రదీప్‌కమార్ తెలిపారు.

## వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 12: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఓయూ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే వివిధ పీజీ డిప్లొమా కోర్సుల పరీక్షలను ఈ నెల 25 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

**సజావుగా టీజీ సీపీజీఈటీ పరీక్షలు**

రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల పరిధిలో అన్ని పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే టీజీ సీపీజీఈటీ పరీక్షలు సజావుగా కొనసాగుతున్నాయి. ఈ నెల 6న ప్రారంభమైన ఈ పరీక్షలు ఈ నెల 16 వరకు జరుగనున్నట్లు సీపీజీఈటీ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి తెలిపారు. హాజరు శాతం 89.84గా నమోదైందని పేర్కొన్నారు.

## లెప్రసీ బాధితులకు మెడికల్ కిట్లు పంపిణీ

పెద్దఅంబర్‌పేట, జూలై 12: పెద్దఅంబర్‌పేటలోని శాంతినగర్ లెప్రసీ కాలనీ, సంతోష్‌నగర్ లెప్రసీ కాలనీల్లోని 105 మంది లెప్రసీ బాధితులకు ఎన్టీపీసీ ప్రతినిధుల సాయంతో లెప్రసీ సొసైటీ ద్వారా శుక్రవారం మెడికల్ కిట్లు, టబ్బులు అందజేశారు. సొసైటీ ఆఫ్ లెప్రసీ ఎఫెక్టెడ్ పర్సన్స్ తెలంగాణ ప్రెసిడెంట్ ఎం రమేశ్, స్థానిక నాయకులు వడ్డేపల్లి విజయేందర్‌రెడ్డితో కలిసి బాధితులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీల ప్రతినిధులు సామెల్, రమేశ్ పాల్గొన్నారు.



# కార్యకర్తలకు అండగా ఉంటాం

కడ్తాల్, జూలై 12: కల్వకుర్తి నియోజకవర్గంలో ఆపదలో ఉన్న ఉన్న ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. కడ్తాల్ మండల పరిధిలోని పల్లెచెల్కతండా గ్రామ పంచాయతీకి చెందిన నాయకుడు పాండూనాయక్, అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని నిమ్స్ దవాఖానాలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న రాఘవేందర్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం పాండునాయక్‌ని పరామర్శించారు. అనంతరం వైద్య ఖర్చుల కోసం ఆయన రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రమేశ్‌నాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రీనునాయక్, గ్రామాధ్యక్షుడు బాలుదాస్‌నాయక్, మాజీ ఉప సర్పంచ్ సీతారాంనాయక్, నాయకులు దీప్లానాయక్, నర్సింహ పాల్గొన్నారు.

**బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం**

కడ్తాల్ : కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని డీసీసీ ప్రధాన కార్యదర్శి భీక్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్ అన్నారు. మండల పరిధిలోని చరికొండ గ్రామంలో కొత్తపల్లి జంగయ్య, చిందం గుండాలు, బోపల్లి కిష్టమ్మ వివిధ కారణాలతో మరణించారు. విషయం తెలుసుకున్న నాయకులు శుక్రవారం, స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం ఆయా కుటుంబాలకు ఐదు వేల చొప్పున రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాములుగౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు జహంగీర్ అలీ,మహేశ్, రాములు, కృష్ణయ్య, హరిచందర్ పాల్గొన్నారు.